సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 21 । అక్టోబర్ । 2023



మీ త్యాగం మరువం !
పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శనివారం నుంచి స్మారకోత్సవాలు ప్రారంభం కానున్నాయి. IIలో



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/22.4°
జిల్లా పరిధిలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం తగ్గింది. ఉక్కపోత కొనసాగుతోంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మడకశిరలో ఇసుక డిపో ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: మడకశిరలో ఇసుక డిపోను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో డీఎల్ఎస్‌సీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, మైన్స్ ఏడీ రామమోహన్‌రావులతో కలిసి మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలతో పాటు ప్రజల అవసరాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. నదుల పక్కనే ఉన్న వారు స్వంత అవసరాలకు ఎడ్లబండిపై ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతించామన్నారు. కొంత మంది కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు ఇసుక అమ్మకాలు చేస్తున్నారని, అలాంటి వారికి అడ్డుకట్ట వేయాలన్నారు. కమిటీ సభ్యుల అనుమతితో జిల్లాలో పరిగి మండలం సిగ్గుపల్లి, తాడిమర్రి మండలం నాయనపల్లిలో ఇసుక తీసుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు. కార్యక్రమంలో డీటీఓ కరుణాసాగర్‌రెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, సెబ్ అధికారి రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రషీద్‌ఖాన్, ప్రతాప్, గంగాధర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

‘జగనన్న సివిల్ సర్వీసెస్’ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో సామాజిక, విద్య, ఆర్థికంగా వెనుకబడిన బలహీనమైన వర్గాలకు చెందిన అభ్యర్థులను సివిల్స్ వైపు ప్రోత్సహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి’ అని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిక అధికారి శివరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారి కోసం నగదు ప్రోత్సాహకం అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష , మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.50 వేలను అందించనున్నట్లు తెలిపారు. 2023లో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు నవంబర్ 4వ తేదీలోపు www.jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమాల ‘వరద’

- వరదాపురం సూరి స్టోన్ క్రషర్ యూనిట్‌లో భారీ అక్రమాలు
- గనుల శాఖ అధికారుల తనిఖీలో వెల్లడి
- నోటీసులకు స్పందించని యాజమాన్యం
- రూ.1.60 కోట్ల జరిమానా విధించిన అధికారులు



స్టోన్ క్రషర్ యూనిట్

అనంతపురం టౌన్: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి)కు చెందిన స్టోన్ క్రషర్ యూనిట్ నిర్వహణలో భారీఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయం భూగర్భ గనుల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలైంది. దీంతో ఏకంగా రూ.1.60 కోట్ల జరిమానా విధించారు. వరదాపురం సూరికి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ సంస్థ పేరిట అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లి సమీపంలో సర్వేనంబర్ 40-4, 53లో స్టోన్ క్రషర్ యూనిట్ నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న క్వారీ నుంచి రోడ్డు మెటల్‌ను క్రషర్‌లోకి తరలించి 40 ఎంఎం, 20 ఎంఎం, 12 ఎంఎం, 6 ఎంఎం..ఇలా వివిధ రకాల మెటల్(కంకర)తో పాటు డస్ట్‌గా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే క్వారీలో నుంచి తరలించిన స్టాక్‌కు.. క్రషర్‌లోని స్టాక్‌కు భారీ వ్యత్యాసం ఉన్న విషయం ఇటీవల గనులశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలో వెల్లడైంది.

24 వేల క్యూబిక్ మీటర్లకు లెక్కలేదు!

చియ్యేడు గ్రామ సమీపంలోని క్వారీ నుంచి తరలించిన రోడ్డు మెటల్.. క్రషర్‌లో ఉన్న రోడ్డు మెటల్ స్టాక్ వివరాల్లో భారీ వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు క్వారీలో కొలతలు తీశారు. 24,370 క్యూబిక్ మీటర్లకు సంబంధించిన రోడ్డు మెటల్ వివరాలను క్రషర్ యూనిట్ నిర్వాహకులు రికార్డుల్లో నమోదు చేయకుండా.. ఎలాంటి సీనరేజీ చెల్లించకుండానే అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. ఆ మెటల్ ఎక్కడికి తరలించారో తెలపాలంటూ నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ యాజమాన్యానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిపై యాజమాన్యం ఏమాత్రమూ స్పందించలేదు. దీంతో అధికారులు అక్రమంగా తరలించిన రోడ్డు మెటల్‌కు ఎంత మొత్తం అవుతుందో లెక్కగట్టి ఐదు రెట్లు జరిమానా విధించారు. మొత్తం రూ.1.60 కోట్ల జరిమానా సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో క్రషర్ యూనిట్‌ను సీజ్ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయి

నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్‌కు చెందిన స్టోన్ క్రషర్ యూనిట్‌లో రోడ్డు మెటల్‌కు సంబంధించి భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయి. క్వారీ నుంచి వచ్చిన మెటల్‌కు, క్రషర్‌లో ఉన్న స్టాక్‌కు మధ్య భారీ వ్యత్యాసాన్ని గుర్తించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదు. దీంతో రూ.1.60 కోట్ల జరిమానా సకాలంలో చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపాం. క్వారీల్లో అక్రమ తవ్వకాలు, క్రషింగ్ చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిని ఉపేక్షించం. ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– నాగయ్య, గనులశాఖ డీడీ, అనంతపురం

వైవీఆర్ నుంచి నీటి విడుదల



డ్యాం దగ్గర గంగ పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని యోగి వేమన రిజర్వాయర్ నుంచి 0.1 టీఎంసీ నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా శుక్రవారం చెరువులకు, కుంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విడుదల చేశారు. డ్యాం వద్ద వేద పండితుల సమక్షంలో గంగ పూజ చేశారు. అనంతరం కుడి, ఎడమ కాలువలకు నీటిని వదిలారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల ద్వారా వైవీఆర్‌కు 0.780 టీఎంసీల నీరు చేరిందన్నారు. ఇందులో 0.1 టీఎంసీ నీటిని 6 చెరువులకు, పలు కుంటలకు విడుదల చేశామన్నారు. కుడి కాలువ ద్వారా దొరిగిల్లు పాత చెరువు, బూదనంపల్లి, కొడవండ్లపల్లి చెరువులకు, ఎడమ కాలువ ద్వారా దొరిగిల్లు పెద్ద చెరువు, సంకేపల్లి, గాండ్లవారిపల్లి చెరువులకు నీరు చేరుతుందన్నారు. కార్యక్రమంలో వైవీఆర్ ప్రాజెక్ట్ ఈఈ ప్రతాప్, డీఈ రాజ్‌కుమార్, ఏఈ కృష్ణకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా శిబిరాలు

- మల్లాపల్లిలో ఆరోగ్య సురక్ష క్యాంపును తనిఖీ చేసిన కలెక్టర్



మల్లాపల్లిలో ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల: మండల పరిధిలోని మల్లాపల్లి రాధాకృష్ణ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపును కలెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపునకు వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపునకు వచ్చిన వారికి అందిస్తున్న వైద్యసేవలను, ఇస్తున్న మందులను నిశితంగా పరిశీలించారు. మాత్రలు ఏవిధంగా ఉపయోగించాలో తెలియచేసేవిధంగా రోగులకు ప్రిస్కిప్షన్ ఇవ్వాలని వైద్యులను ఆదేశించారు. క్యాంపులకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా హడావుడిగా క్యాంపులు నిర్వహించకూడదని అధికారులకు సూచించారు. శుక్రవారం మల్లాపల్లిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపునకు 530 మంది వచ్చినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 వైద్య శిబిరాల నిర్వహణ

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 11 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. 3,743 మంది రోగులకు ఓపీ సేవలు అందించారు.1144 మందికి కంటి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. 237 మందికి కంటి అద్దాలను అందించారు. 42 మంది ఎంబీబీఎస్ వైద్యులు, 20 మంది స్పెషలిస్ట్ వైద్యులు వైద్య సేవలను అందించారు.

నేడు 17 చోట్ల వైద్య శిబిరాలు

జిల్లా వ్యాప్తంగా శనివారం 17 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. కనగానపల్లి మండలం తగరకుంట, బత్తలపల్లి మండలం ఓబులాపురం, తలుపుల మండలం నూతనకాలువ, రామగిరి మండలం మోటారు చింతలపల్లి-1లో శిబిరాలు జరుగుతాయన్నారు. అలాగే మడకశిర మండలం ఆమిదాలగొంది-2, రొళ్ల మండలం రొళ్ల-2, పెనుకొండ మండల వెంకటరెడ్డిపల్లి, నల్లచెరువు మండలం పి.కొత్తపల్లి, గోరంట్ల మండల మందలపల్లి-1, సోమందేపల్లి మండలం మాగే చెరువు , హిందూపురం మండలం చలివెందులలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. లేపాక్షి మండలం శిరివరం, చిలమత్తూరు మండల దేమకేతేపల్లి -1, కదిరి మండలం కుటాగుళ్ల అర్బన్ , ధర్మవరం మండల ఎల్‌సీకె పురం, సిద్దయ్యగుట్ట, కేతిరెడ్డి కాలనీ, ధర్మవరం అర్బన్ గాంధీనగర్,ధర్మవరం శివానగర్‌లలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

● సరస్వతీదేవి అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాలు ఖాద్రీ ఆలయంలో వేడుకగా జరుగుతున్నాయి. ఆరో రోజైన శుక్రవారం ఖాద్రీశుడు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఖాద్రీ ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి ఉత్సవాలను పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయం, మరకత మహాలక్ష్మి ఆలయం, వాసవీమాత ఆలయాల్లోనూ అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



ఘనంగా సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం



సంగీత కచేరి నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ప్రశాంతి నిలయంలో అక్టోబర్ 20న సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. 1946లో సత్యసాయి తన 14వ ఏట అక్టోబర్ 20న సాయిబాబాగా తన అవతార ప్రకటన చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా అవతార ప్రకటన దినోత్సవం నిర్వహిస్తున్నారు. శుక్రవారం అనంతపురంలోని సత్యసాయి మహిళా క్యాంపస్ పూర్వ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి నిర్వహించారు. దసరా వేడుకల్లో భాగంగా ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహిస్తున్న వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం కొనసాగుతోంది.

విశిష్ట సేవలకు ప్రతిష్టాత్మక పురస్కారం

- ఇద్దరికి ‘వైఎస్సార్ జీవిత సాఫల్య’ అవార్డులు
- వ్యవసాయంలో వైవీ మల్లారెడ్డి.. జానపదంలో చిగిచెర్ల కృష్ణారెడ్డి

అనంతపురం / కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలకు ఉమ్మడి అనంతపురం జిల్లానుంచి ఇద్దరు ప్రముఖులు ఎంపికయ్యారు. పర్యావరణ హితమే అభిమతంగా వ్యవసాయ రంగంలో సేవలందిస్తున్న వైవీ మల్లారెడ్డి, కళలు–సంస్కృతి విభాగంలో జానపద కళల ప్రాచుర్యానికి విశేష కృషి చేస్తున్న చిగిచెర్ల కృష్ణారెడ్డిని పురస్కారాలు వరించాయి. వీరు నవంబరు ఒకటో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారంతో పాటు రూ.10 లక్షల నగదు, ప్రశంసా పత్రం అందుకోనున్నారు.

పర్యావరణ హితం.. మల్లారెడ్డి అభిమతం

శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం నీరుకుంట్లపల్లికి చెందిన డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఇంగ్లండ్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 42 సంవత్సరాల కాలంలో విశేషమైన సేవా కార్యక్రమాలు చేపట్టారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) తరహాలోనే స్వయంప్రతిపత్తి గల యాక్షన్ ఫెటర్నా ఎకాలజీ సెంటర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలోనే నడుస్తోంది. ఆర్డీటీతో పాటు ఈ ఎకాలజీ సెంటర్‌ను సైతం దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించారు. గత 15 సంవత్సరాల నుంచి డాక్టర్ వైవీ మల్లారెడ్డి డైరెక్టర్‌గా ఎకాలజీ కేంద్రం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 235 గ్రామాల్లో మొత్తం 60 వేల మంది రైతులకు, భూమి లేని నిరుపేదలకు, ఇతరులకు దోహదపడే కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దేశంలోనే రెండో దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో కరువు నివారణ, పునరుజ్జీవం, వర్షాధార వ్యవసాయాన్ని బలోపేతం చేసే దిశగా వాటర్‌షెడ్‌ల నిర్మాణం, వాతావరణంలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పెంపొందించే దిశగా ఎకాలజీ సెంటర్ విశేష కృషి చేస్తోంది. ఇందుకు డాక్టర్ వైవీ మల్లా రెడ్డి అంకితభావంతో పని చేయడమే కారణం.



ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ (ఇన్‌సెట్) వైవీ మల్లారెడ్డి

- ఫుల్ బ్రైట్ ఫెలో (2006), ఇండో అమెరికన్ ఎన్విరాన్‌మెంటల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం (ఈఎల్‌పీ) కింద కరువు నివారణ, స్వల్ప వర్షపాతంలో మెరుగైన వ్యవసాయాన్ని ఎలా చేయవచ్చనే అంశంపై మల్లారెడ్డి అమెరికాలో అధ్యయనం చేసి అనంతపురంలో అమలు చేస్తున్నారు.
- 25 దేశాల్లో 20 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు.
- 2004లో రైతు సంక్షేమ కమిషన్ సభ్యునిగా పని చేశారు.
- ఏపీ వాటర్ కన్జర్వేషన్ మిషన్‌లో (2000–2004) సభ్యులుగా ఉన్నారు.
- 2003–06 మధ్య అనంత గ్రామీణ బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్నారు.
- 2003–07 మధ్య నాబార్డ్ స్టేట్ లెవల్ వాటర్ షెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా కొనసాగారు.
- 2019లో రాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ మిషన్ సభ్యునిగా నియమించింది.



శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో కృష్ణారెడ్డి (ఇన్‌సెట్) కృష్ణారెడ్డి

- 2007లో అనంత ప్రస్థానం అనే పుస్తకాన్ని రచించారు.
- ఎకాలజీ సెంటర్‌కు 2022లో ఉత్తమ ఎన్జీఓ అవార్డు దక్కింది. భారత ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌కర్, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ చేతుల మీదుగా ఈ ఏడాది జూన్ 17న అవార్డు అందుకున్నారు.

జానపద కళాబ్రహ్మ ‘చిగిచెర్ల’

జానపద కళాబ్రహ్మగా గుర్తింపు పొందిన చిగిచెర్ల కృష్ణారెడ్డి కీర్తికిరీటంలో మరో అరుదైన పురస్కారం చేరింది. జానపదంలో ఎనలేని సేవలందించిన చిగిచెర్ల కృష్ణారెడ్డి 1954లో ఉమ్మడి జిల్లా ధర్మవరం మండలం సుబ్బారావుపేటలో చిగిచెర్ల పెద్దారెడ్డి, ఓబుళమ్మ దంపతులకు జన్మించారు. 1986లో ఎస్కేయూనివర్సిటీలో జానపద కళలపై పీహెచ్‌డీ పట్టానందుకున్న ఆయన 1987 వరకు వైఎస్సార్ జిల్లా పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. మరుసటి ఏడాది నుంచి 2014 వరకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా, రీడర్‌గా, ఆచార్యునిగా వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత కూడా జానపద కళల ప్రాచుర్యానికి విశేషంగా శ్రమిస్తున్నారు. బోధన, పరిశోధన, గ్రంథ ప్రచురణ, కళా ప్రదర్శనలతో రెండు తెలుగు రాష్ట్రాల వారికి జానపద కళల్లో ఆసక్తిని, అనురక్తిని కల్గించిన ఆయన ఇప్పటి వరకు 2వేలకు పైగా ప్రదర్శనలిచ్చారు. స్వయంగా ఆడుతూ పాడుతూ ప్రేక్షకులను సమ్మోహితులను చేస్తూ ఆయన ఆధ్వర్యంలో సాగిన సాహిత్య, కళా ప్రదర్శనలు ఎంతో మందిలో స్ఫూర్తిని నింపాయి. ఆయన వద్ద 66 మంది ఎంఫిల్, మరో 34 మంది పీహెచ్‌డీ పట్టాలందుకున్నారు. గతంలో నవరత్నాల పేరిట ఆయన రాసిన పుస్తకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించగా.. అంతకు ముందు చిగిచెర్ల కృష్ణారెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత ప్రధాని వాజ్‌పేయి చేతుల మీదుగా పురస్కారాలు, అభినందనలు అందుకున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- డీఆర్‌ఓ కొండయ్య



డీఆర్‌ఓకు విన్నవిస్తున్న స్టాఫ్‌నర్సులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే పలువురు ఉద్యోగులు అర్జీలు అందించారు. అర్జీలను తీసుకున్న డీఆర్‌ఓ కొండయ్య ఆయా శాఖల ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు పంపి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. 15 మంది ఉద్యోగుల అర్జీలు సమర్పించారు. వినతుల్లో కొన్ని ఇలా...

- 2015, 2019 పీఆర్సీ ప్రకారం జీతభత్యాలు రావడంలేదని పుట్టపర్తి మండలం బీడుపల్లి ఉన్నత పాఠశాలలో గ్రేడ్-1 హెచ్‌ఎంగా పని చేస్తున్న లక్ష్మీదేవి అర్జీ అందజేశారు. తన సర్వీస్ రిజిష్టర్ ఆటోలో పోగొట్టుకోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, సమస్య పరిష్కరించాలని విన్నవించారు.
- జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న తమకు జనవరి నుంచి జీతభత్యాలు అందడంలేదని మల్లిక, భార్గవి, రేవతి, నాగకన్య ఫిర్యాదు చేశారు. వైద్యశాఖ నుంచి ట్రెజరీకి జీతాలు పంపినా తమకు జమ కావడం లేదన్నారు. సమస్య పరిష్కరించి జీతాలు అందేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

22న ఎడ్లబండ్ల పరుగు పందెం

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రం పంచాయతీ నడింపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఈ నెల 22న జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.2 వేలు చెల్లించాలని కోరారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ సూర్యనారాయణ హాజరవుతారన్నారు. వివరాలకు సెల్: 6281390877, 9052877161 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి టౌన్: తనకల్లు మండలంలోని పెద్దపల్లి గ్రామ శివారులో చాకవేలు క్రాస్ వద్ద పోలీసులు భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, తనకల్లు పోలీసులు దాడి చేసి, ఓమినీ వాహనంతోపాటు 92 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కదిరి రూరల్ సర్కిల్‌లో స్టేషన్‌లో డీఎస్పీ శ్రీలత విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రూ.3,27,790 విలువ జేసే 92 బాక్సుల్లోని టెట్రా ప్యాకెట్లు, విస్కీ, బీర్లు, ఓల్డ్ అడ్మిరల్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్న కళ్యాణ్‌కుమార్, సతీష్, నారాయణస్వామి, మురళిలో సతీష్ మాత్రమే పట్టుబడ్డాడని తెలిపారు. మిగిలిన ముగ్గురూ పరారయ్యారన్నారు. సమావేశంలో సీఐలు నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సిబ్బంది పాల్గొన్నారు.

మీ త్యాగం మరువం!

పోలీస్ అంటే భరోసా, పోలీస్ అంటే భద్రత, పోలీస్ అంటే ధైర్యం, పోలీస్ అంటే రక్షణ. వీవీఐపీలు వస్తున్నారంటే మూడురోజుల ముందు నుంచే రోడ్లపై పహారా కాస్తారు. మన ఇంట్లో దొంగలు పడ్డారంటే పరిగెత్తుకొచ్చేది వారే, ఎక్కడైనా గొడవ జరుగుతుందని ఫోన్ చేస్తే ఆగమేఘాలమీద వాలిపోయేది ఖాకీలే. పెద్దోళ్ల ఇళ్లలో పెళ్లిళ్లు అయినా.. కర్ఫ్యూలైనా.. ఆఖరికి కరోనా లాంటి సమయాల్లోనూ వారి సేవలను వెలకట్టలేం. విధి నిర్వహణలో ఒక్కోసారి అసాంఘిక శక్తుల చేతుల్లో వారు ప్రాణాలు సైతం కోల్పోతుంటారు. అలాంటి వారిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



సంస్మరణ దినోత్సవానికి రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

- విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులు
- నేడు సంస్మరణ దినోత్సవం
- జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు

పుట్టపర్తి టౌన్: పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శనివారం నుంచి స్మారకోత్సవాలు ప్రారంభం కానున్నాయి. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు జోహార్లు అర్పిస్తూ.. స్మారకోత్సవాలను ఘనంగా నిర్వహించేలా జిల్లా పోలీసుశాఖ ఏర్పాట్లు చేసింది. నేటి నుంచి 10 రోజుల పాటు ప్రతి సర్కిల్‌స్టేషన్ పరిధిలోనూ అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

సైనికుల ప్రాణత్యాగం

భారత్ – చైనా సరిహద్దుల్లో లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్ వద్ద 1959 అక్టోబర్ 21న మన దేశానికి చెందిన సీఆర్‌పీఎఫ్ విభాగానికి సంబంధించిన 10మంది సైనికులు చైనా బలగాలతో జరిగిన పోరాటంలో వీరమరణం పొందారు. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల పోలీస్ అధికారులు 1960 జనవరి 9న సమావేశమై అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తీర్మానించారు.

జిల్లాలో ఇద్దరు అమరవీరులు

శ్రీసత్యసాయి జిల్లాలో చంద్రశేఖర్, బాబావలి ఇద్దరు శాంతి భద్రతల పరిరక్షణ, సమాజం కోసం అమరులయ్యారు. విధి నిర్వహణలో మరణం పొందిన మరో ఆరుగురు పోలీసులకు శనివారం పోలీస్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించనున్నారు.

శ్రద్ధాంజలి ఘటించేందుకు ఏర్పాట్లు పూర్తి

పోలీసుల అమరవీరులకు నివాళులర్పించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు సమావేశం నిర్వహించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్‌కలెక్టర్ కార్తీక్, జిల్లా జడ్జి రాకేష్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరై అమరవీరులకు నివాళులర్పించనున్నారు.

పోలీస్ అంటేనే బాధ్యత



“ పోలీస్ ఉద్యోగం అంటే బాధ్యతతో కూడుకున్నది. సమాజం కోసం మేము సైతం అంటూ ఖాకీ దుస్తులు వేసుకొని వచ్చే పోలీసులు కొన్నిసార్లు అసాంఘిక శక్తుల చేతుల్లో వీరమరణం పొందుతుంటారు. వారి త్యాగాలను గుర్తు చేసుకునేందుకే పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నాం. పోలీసుల సంక్షేమం కోసం కృషి చేస్తాం. – మాధవరెడ్డి, ఎస్పీ

ఆర్. బాబావలి



బాబావలి 1992 సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. శాంతిభద్రతలు, సమాజ శ్రేయస్సుకు నిరంతరం పరితపించేవారు. హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో ఉన్న పోలీస్ కారిడార్‌లో గన్‌మెన్‌గా శిక్షణ పొంది పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు గన్‌మెన్‌గా పనిచేశారు. 2003 సంవత్సరం జనవరి 18న అనంతపురంలో గుర్తు తెలియని దుండగుల చేతిలో వీర మరణం పొందారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించింది. ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించి ఆయన భార్యకు ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించింది.

తాటిపి చంద్రశేఖర్



తాటిపి చంద్రశేఖర్ 1994వ సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. చిలమత్తూరు, రామగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. విధి నిర్వహణలో ధైర్య సాహసాలతో నిజాయితీ నిబద్ధతతో పనిచేసేవారు. 2003 సంవత్సరం సెప్టెంబర్ 23న చంద్రశేఖర్‌తో పాటు హనుమంతుని సీపీఐ మావోయిస్టు రామగిరి దళం కిడ్నాప్ చేసింది. ఆ తరువాత హనుమంతుని విడుదల చేసింది. మరుసటి రోజు సోమరవాండ్లపల్లి అటవీ ప్రాంతంలో చంద్రశేఖర్ మృతదేహం లభ్యమైంది. అమరుడైన చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఇంటి స్థలంతో పాటు కోపరేటివ్ సొసైటీ బ్యాంక్‌లో ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మార్చురీలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండలంలోని వై. కొత్తపల్లిలో విద్యుదాఘాతంతో రామాంజనేయులు (38) మృతిచెందాడు. గ్రామానికి చెందిన రామాంజనేయులు శుక్రవారం అర్ధరాత్రి పొలం వద్ద స్టార్టర్ ఆన్ చేయగా, విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. బంధువులు అతన్ని చికిత్సనిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మార్చురీలో రామాంజనేయులు మృతదేహాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి సందర్శించి, నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తికి గాయాలు

హిందూపురం అర్బన్: రిపేరీ కోసం పోల్ ఎక్కిన ప్రైవేటు వ్యక్తి ఉన్నపళంగా విద్యుత్ షాక్ తగిలి కిందపడటంతో గాయాలయ్యాయి. లైన్‌మన్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. తూమకుంట 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని సంతేబిదనూరు సమీపంలో గురువారం విద్యుత్ లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో లైన్‌మెన్ మురళీప్రసాద్ ఎల్‌సీ తీసుకున్నాడు. హనుమంతు అనే ప్రైవేట్ వ్యక్తిని పోల్ ఎక్కించగా విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన హనుమంతును వెంటనే హిందూపురం ఆస్పత్రికి, అక్కడ్నుంచి బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని బంధువులు శుక్రవారం తెలిపారు. లైన్‌మన్ బ్రేక్ డౌన్ అయిన లైన్‌కు బదులు మరొక లైన్‌కు ఎల్‌సీ తీసుకోవడం వల్లే ప్రైవేటు వ్యక్తి షాక్‌కు గురైనట్లు తెలిసింది. ఘటనకు దారి తీసిన కారణాలపై నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈఈ భూపతి తెలిపారు.

బాలుడిని తల్లికి అప్పగించిన జీఆర్‌పీ పోలీసులు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్

ధర్మవరం అర్బన్: సరదాగా రైలు చూసేందుకు రైలు ఎక్కిన ఓ బాలుడు..రైలు కదలడంతో అలాగే ప్రయాణించి చివరికి ధర్మవరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు..కడపకు చెందిన 6వ తరగతి విద్యార్థి సందీప్‌కుమార్ గురువారం రైలు చూసేందుకు ఎర్రముక్కలపల్లి రైల్వేస్టేషన్‌లో తిరుపతి నుంచి గుంతకల్లుకు వెళ్లే రైలు ఎక్కాడు. బాలుడు రైలు ఎక్కగానే అది కదిలింది. కిందకు దిగలేక అలాగే ప్రయాణించి గుత్తి రైల్వేస్టేషన్‌లో దిగాడు. అక్కడ నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్కి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో దిగాడు. స్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫారంలో ఉండగా జీఆర్‌పీ ఎస్‌ఐ గోపీకుమార్, హెడ్‌కానిస్టేబుల్ షణ్ముకానందరెడ్డి ఆ బాలుడిని విచారించారు. జీఆర్‌పీ పోలీసులు బాలుడి తల్లి మేరీకి సమాచారం ఇవ్వడంతో ఆమె శుక్రవారం ధర్మవరం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ సీఐ నాగరాజు మాట్లాడుతూ దసరా సెలవులు కావడంతో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారు ఎక్కడికి వెళుతున్నారో గమనించాలన్నారు.

జగన్‌తోనే వాల్మీకులకు గుర్తింపు

- ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట
- హాజరైన మంత్రి గుమ్మనూరు, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే, నాయకులు



వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుమ్మనూరు, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వాల్మీకులకు గుర్తింపు దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని యల్లనూరు రోడ్ సర్కిల్ వద్ద తాడిపత్రి వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా జరిగింది. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠకు ముందు హోమం, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వాల్మీకులు, ప్రజలు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రామచంద్ర, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్ జిల్లా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సాకే ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, పామిడి వీరాంజనేయులు, సజ్జలదిన్నె సర్పంచ్ నీరజ, జెడ్పీటీసీ రమణమ్మ హాజరయ్యారు.

పిల్లల భవిష్యత్‌కు పునాదులు వేయాలి..

ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణం రాయడంతోనే వాల్మీకులకు గొప్ప పేరు వచ్చిందన్నారు. వాల్మీకులంతా ఐక్యంగా ఉంటూనే వారి పిల్లల భవిష్యత్తులకు పునాదులు వేసుకోవాలని కోరారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లడంతో పాటు ఆయా రంగాల్లో మనం కూడా రాణించాలని ఎంపీ ఆకాక్షించారు.

విలేజ్ సర్వేయర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి – మడుగుపల్లి రోడ్డుపై శుక్రవారం ఉదయం కుమ్మనమల విలేజ్ సర్వేయర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఉద్యోగ రీత్యా కుమ్మనమల సచివాలయం నుంచి రీసర్వే పనుల్లో భాగంగా మడుగుపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, దాడి జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఎంపిక

అనంతపురం అర్బన్: తాడిపత్రిలో ఈనెల 19న జరిగిన రాష్ట్ర సదస్సులో పండ్లతోటల రైతు సంఘం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. పరిశీలకుడిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు వి.రాంభూపాల్ వ్యవహరించారన్నారు. నూతన రాష్ట్ర కమిటీ ఇదే : పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.శివారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా త్రిలోక్, రాజారామిరెడ్డి, వెంకటచౌదరి, గార్లదిన్నె చెన్నారెడ్డి, వరదాయపల్లి లక్ష్మీనారాయణరెడ్డి ఎన్నికయ్యారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి సమీపంలో 960 టెట్రా ప్యాకెట్లు పట్టుబడినట్లు సెబ్‌సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం నుంచి రాయదుర్గానికి నీరుగంటి పాండురంగ, నాయకుల తిప్పేస్వామి, జగలూరి బాలన్న మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ హరికృష్ణ , హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్, సిబ్బంది శివయ్య, ఇమ్రాన్, తిమ్మన్న, జ్యోతి, అనిల్ పాల్గొన్నారు.

ఓటీపీలపై తస్మాత్ జాగ్రత్త

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ పథకాల కోసం ఓటీపీల సేకరణపై సైబర్ నేరగాళ్లు దృష్టి సారించారని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్మ ఒడి పథకం నిధులు మంజూరు చేస్తామని ఓటీపీలు చెప్పాలని అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ పథకానికైనా ఓటీపీ అవసరమైతే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది నేరుగా లబ్ధిదారుల వద్దకే వస్తారని, వారికి మాత్రమే చెప్పాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ప్రజలను మభ్యపెట్టి ఖాతాల్లోని డబ్బు కాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు ఓటీపీల వద్ద జాగ్రత్త వహించాలన్నారు.